క్లుప్తంగా

డ్రైనేజీ కాలువలు నిర్మించాలి



కమిషనర్ మనోజ్‌రెడ్డికి వినతి పత్రం సమర్పిస్తున్న కార్పొరేటర్ ఎస్‌ఎండీ షఫీ

కడప కార్పొరేషన్: కడప నగరం 30వ డివిజన్ పరిధిలోని నాగరాజుపేటలో డోర్ నంబర్ 4/184 నుంచి 112-1, 4/203-4 నుంచి 4/203-1 వరకూ డ్రైనేజీ కాలువలు నిర్మించాలని ఆ డివిజన్ కార్పొరేటర్ ఎస్‌ఎండీ షఫీ కోరారు. సోమవారం కమిషనర్ మనోజ్‌రెడ్డికి ఆయన వినతి పత్రం సమర్పించారు. కాలువలు లేకపోవడంతో ఈ వర్షాకాలంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అక్కడే ఒక విద్యుత్ స్తంభం ఏర్పాటు చేసి వీధి లైటు ఏర్పాటు చేయాలని కోరారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం

కడప సెవెన్‌రోడ్స్ : త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందు జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సోమవారం కడప నగరంలోని మోడమీదపల్లె గ్రామంలో త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథ ప్రచారం నిర్వహించారు. ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన గ్రంథాలను ప్రజలకు పరిచయం చేశారు. గీతాజ్ఞానం ద్వారా సమాజంలో కులమత అసమానతలు పోతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రబోధ సేవా సమితి కడప అధ్యక్షులు నవనీశ్వర్‌రెడ్డి, కె.వెంకట రమణ, ఈశ్వర్, సదానందుడు, జి.యల్లారెడ్డి, రామనాథం, గంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ పీడీపై చర్యలు తీసుకోవాలి

కడప సెవెన్‌రోడ్స్ : పలు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మిపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి మనోహర్ కోరారు. సోమవారం ఇన్‌ఛార్జి కలెక్టర్ అదితిసింగ్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. జిల్లాలో ప్రభుత్వ భవనాలు 1059 ఉన్నాయని పేర్కొన్నారు. ఈ సెంటర్ల నిర్వహణ కోసం ప్రభుత్వం ఒక్కో సెంటర్‌కు రూ. 3000 ఇచ్చిందని తెలిపారు. ఇలా రూ. 31.80 లక్షలు విడుదలైందన్నారు. ఇందులో ఐసీడీఎస్ పీడీ పలు అవకతవకలకు పాల్పడ్డారని ఆరోపించారు. ఆమె వ్యవహారంపై విచారణ నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో పవన్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఖర్గే పుట్టినరోజు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పుట్టినరోజు వేడుకలను సోమవారం కాంగ్రెస్ పార్టీ నేతలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక అల్ షిఫా మానసిక వికలాంగుల కేంద్రంలో అక్కడి విద్యార్థుల ద్వారా కేకును కట్ చేసి వారికి పంచిపెట్టారు. అనంతరం పలు రకాల ఫలాలను వారికి పంపిణీ చేశారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్, కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కమల్ బాష తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతానందన్ సేవలు విలువైనవి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: ప్రముఖ సీపీఐ(ఎం) నేత, కేరళ మాజీ ముఖ్యమంత్రి వి.ఎస్. అచ్యుతానందన్ (102) కొన్ని రోజులుగా అనారోగ్య సమస్యలతో తిరువనంతపురంలోని ఎస్‌యుటి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మరణించారని, దేశంలో కమ్యూనిస్టు ఉద్యమంలో ఆయన అందించిన సేవలు మరువలేమని సీపీఎం కడప నగర కార్యదర్శి రామమోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. వామపక్ష పార్టీలో చీలిక వచ్చిన తర్వాత సిపిఎంను స్థాపించడంలో ప్రముఖ పాత్ర వహించినవారిలో అచ్యుతానందన్ ఒకరని అన్నారు. వి.ఎస్. అచ్యుతానందన్ కేరళ ముఖ్యమంత్రిగా, మూడుసార్లు ప్రతిపక్ష నేతగా, ఏడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారన్నారు.

సూపర్ సిక్స్‌తో చంద్ర బాబు వంచన



కొత్తగంగిరెడ్డిపల్లెలో పర్యటిస్తున్న నరేన్ రామాంజులురెడ్డి

పెండ్లిమర్రి: సూపర్ సిక్స్ హామీలతో అన్ని వర్గాల ప్రజలను సీఎం చంద్రబాబునాయుడు వంచించారని వైఎస్సార్‌సీపీ కమలాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పి.నరేన్‌రామాంజులరెడ్డి మండిపడ్డారు. మండలంలోని కొత్తగంగిరెడ్డిపల్లె గ్రామంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రమణారెడ్డి ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ పై సోమవారం సాయంత్రం ఇంటింటికి తిరిగి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ఎన్నికల సమయంలో తప్పుడు హామీలిచ్చి ప్రజలను నిలువునా మోసం చేశాడన్నారు. ఏడాది పాలనలో సంక్షేమ పథకాలు అమలు చేయకపోవడంతో ప్రతి కుటుంబానికి ఎంత నష్టం జరిగిందో ప్రజలకు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, నాగేంద్రారెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, నాగమల్లారెడ్డి, వీరారెడ్డి, సుదర్శన్‌రెడ్డి, శివ, శ్రీను పాల్గొన్నారు.

కొనసాగుతున్న మున్సిపల్ కార్మికుల సమ్మె

- సమ్మెకు మేయర్ సంఘీభావం
- ఎనిమిదో రోజు భిక్షాటన చేసి నిరసన తెలిపిన కార్మికులు



కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న మేయర్ సురేష్ బాబు

కడప కార్పొరేషన్: ఎనిమిది రోజులుగా మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు, వారికి మద్దతుగా పారిశుద్ధ్య కార్మికులు చేస్తున్న సమ్మెకు కడప మేయర్ కె. సురేష్ బాబు, వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు సంఘీభావం ప్రకటించారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయం ఎదుట కార్మికులు సమ్మెలో భాగంగా భిక్షాటన చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సీఐటీయూ) నగర అధ్యక్షుడు ఎస్. రవి, కోశాధికారి గోపి మాట్లాడుతూ తమ న్యాయమైన సమస్యలపై ప్రభుత్వం తాత్సారం చేయడం దారుణమన్నారు. ప్రభుత్వం విడుదల చేసిన జీవో నంబర్ 36 ప్రకారం ఇంజినీరింగ్ కార్మికులకు వేతనాలు పెంచాలని, కార్మికుల రిటైర్‌మెంట్ వయసును 62 ఏళ్లకు పెంచాలన్నారు. కార్మికులకు ఇచ్చే రూ.13 వేలతో వారి కుటుంబాలు ఎలా జీవించాలని, వారి పిల్లలను ఎలా చదివించుకోవాలని ప్రశ్నించారు. ప్రభుత్వంలోని మంత్రులుగానీ, అధికారులుగానీ ఈ జీతంలో ఒక్కరోజు జీవించగలరా అని ప్రశ్నించారు. కార్మికులకు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలన్నారు. లేదా తమను పర్మినెంట్ చేస్తే ఇవేవీ తాము అడగబోమన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్, నగర అధ్యక్ష, కార్యదర్శులు వెంకట సుబ్బయ్య, చంద్రారెడ్డి, యూనియన్ నాయకులు విజయ్‌భాస్కర్, బ్రహ్మానందరెడ్డి, కేశవ, పవన్ పాల్గొన్నారు.

ప్రభుత్వం వెంటనే స్పందించాలి- మేయర్

మున్సిపల్ కార్మికుల సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించి పరిష్కరించాలని మేయర్ సురేష్ బాబు కోరారు. కడప నగరం పరిశుభ్రంగా ఉందంటే అది కేవలం మున్సిపల్ కార్మికుల వల్లేనన్నారు. గతంలో కార్మికులకు రెండు, మూడు నెలలకోసారి జీతాలు ఇచ్చే పరిస్థితి ఉండేదని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత వారందరినీ ఆప్కాస్‌లో చేర్చి ప్రతినెలా ఒకటో తేదీనే జీతాలు ఇచ్చేలా చేశారన్నారు. కార్మికులకు సంక్షేమ పథకాలు వర్తింపజేసే విషయాన్ని వైఎస్ జగన్ దృష్టికి తీసుకుపోయామని, చివర్లో జీవో ఇచ్చినా ఫలితం లేకుండా పోయిందన్నారు. కార్మికులు తమ ప్రాణాలను ఫణంగా పెట్టి పనిచేస్తున్నారని, వారి సమస్యలపై తాము సానుకూలంగా ఉంటూ పరిష్కరిస్తున్నామన్నారు. కార్మికుల జీతాలు పెంచే విషయమై ఇప్పటికే జనరల్ బాడీ సమావేశంలో తీర్మానం చేశామని గుర్తు చేశారు. కార్మికులకు తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు పాకా సురేష్, షఫీ, డివిజన్ ఇన్‌చార్జులు శ్రీరంజన్‌రెడ్డి, త్యాగరాజు, బసవరాజు, జమాల్‌వలీ పాల్గొన్నారు.

అక్రమ కేసులకు భయపడం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి పాట్టిపాటి జయచంద్రారెడ్డి

కడప కార్పొరేషన్: కూటమి ప్రభుత్వం వైఎస్‌ఆర్ సీపీ నాయకులపై అక్రమ కేసులు బనాయిస్తోందని, ఎన్ని కేసులు పెట్టినా భయపడమని వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి పాట్టిపాటి జయచంద్రారెడ్డి, టీటీడీ బోర్డు మాజీ సభ్యులు ఎస్. యానాదయ్య అన్నారు. సోమవారం జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో లేని మద్యం కేసును సృష్టించి ఒక్కొక్కరినీ అరెస్ట్ చేస్తోందన్నారు. కుక్క తోక పట్టుకొని గోదారి ఈదినట్లు ఈ కేసు ఉందని, దున్నపోతు ఈనిందంటే గాటికి కట్టేయమన్నట్లు సిట్ విచారణ సాగుతోందన్నారు. కోర్టులో ఈ కేసు ఎట్టి పరిస్థితుల్లో నిలబడదన్నారు. చిత్తూరు జిల్లాలో పెద్దిరెడ్డి కుటుంబాన్ని రాజకీయంగా ఎదుర్కోలేక, కక్షసాధింపులో భాగంగానే ఎంపీ మిథున్‌రెడ్డిని అరెస్ట్ చేశారన్నారు. ఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీలు, మేనిఫెస్టోను అమలు చేయని ప్రభుత్వం ప్రజల దృష్టిని మళ్లించేందుకు ఇలా లేని స్కామ్‌లు తెరపైకి తెచ్చి అక్రమ అరెస్ట్‌లు చేస్తోందన్నారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి మునిశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రంలో నారావారి రాజ్యాంగం నడుస్తోంది

కడప కార్పొరేషన్: రాష్ట్రంలో భారత రత్న డా. బీఆర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం అమలు కావడం లేదని, నారావారి రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందని వైఎస్‌ఆర్ కడప జిల్లా బీసి విభాగం అధ్యక్షులు శివరామ్ అన్నారు. సోమవారం ఆయన ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి అక్రమ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలన అంతా అక్రమ కేసులు, అక్రమ అరెస్టులకే పరిమితమైందని, ఈ రెండవ ఏడాదిలో కూడా అవే రాజకీయ కక్ష సాధింపు చర్యలు చేపట్టిందన్నారు.

తరగతులు నిర్వహించని కళాశాలలపై చర్యలేవీ..?

కడప ఎడ్యుకేషన్: యోగివేమన విశ్వ విద్యాలయం పరిధిలో తరగతులు నిర్వహించని బి. ఎడ్, లా కళాశాలపై చర్యలు తీసుకోవాలని ఆర్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు డి.యం. ఓబులేసు యాదవ్ అన్నారు. సోమవారం వైవీయూ పరిపాలన భవనంలో రిజిస్ట్రార్ పుత్తా పద్మ, సిడిసి డీన్ రఘుబాబులను కలిసి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు వారాల క్రితం బీఎడ్, లా పరీక్షల సందర్భంగా ఆర్.ఎస్.ఎఫ్ ఆధ్వర్యంలో తరగతులు నిర్వహించకుండా పరీక్షలు ఎలా నిర్వహిస్తారాని ఆందోళన చేశామన్నారు. దానికి స్పందించిన వర్సిటీ అధికారులు కమిటీ వేసి ఆయా కళాశాలను తనిఖీ చేసి కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారన్నారు. వర్సిటీ అధికారులు చెప్పినట్లుగానే కమిటీ ని రెండు రోజుల్లోగా వేసి ఆయా కళాశాలపై చర్యలు తీసుకోకపోతే ఆర్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో వైవీయు ముట్టడిస్తామని హెచ్చరించారు.

సంగమేశ్వరుడికి పూజలు



పూజలు చేస్తున్న రవీంద్రనాథ్‌రెడ్డి, తదితరులు

వీరపునాయునిపల్లె: వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పోచంరెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి, కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్ నరేన్ రామాంజులరెడ్డి సోమవారం అనిమెల సంగమేశ్వరుడిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో వారికి స్వాగతం పలికారు. అనంతరం , ఆలయం ఎదుట మరకతగణపతి, సంగమేశ్వరుడికి, పార్వతీదేవికి పూజలు జరిపారు. ఆలయ అర్చకులు వారికి తీర్థ ప్రసాదాలు అందజేశారు. మండల కన్వీనర్ రఘునాథరెడ్డి, ఆలయ మాజీ చైర్మెన్ శివాంజనేయరెడ్డి, నరేష్‌రెడ్డి, రాఘవయాదవ్, భాస్కర్‌రెడ్డి, శంభురెడ్డి, గోపాల్‌రెడ్డి, వెంకటరామిరెడ్డి, ప్రతాప్‌యాదవ్, గంగిరెడ్డి, నాగిరెడ్డి, శంకర్‌రెడ్డి, వీరభద్రారెడ్డి పాల్గొన్నారు.

పెండింగ్ ఫీజు రీఎంబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలి

కడప సెవెన్‌రోడ్స్ : రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న రూ. 6400 కోట్ల ఫీజు రీఎంబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ నాయకులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాహుల్, రవి మాట్లాడుతూ యువగళం పాదయాత్రలో లోకేష్ హామీ ఇచ్చిన విధంగా జీఓ 77 ఇప్పటికీ రద్దు చేయక పోవడం విచారకరమన్నారు. అర్హులైన విద్యార్థులకు ఫీజు రీఎంబర్స్‌మెంట్ ఇవ్వాలన్నారు. పెండింగ్‌లో ఉన్న తల్లికి వందనం, విద్యా దీవెన, వసతి దీవెన బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే పెండింగ్‌లో ఉన్న పాఠ్య పుస్తకాలు, విద్యా కానుక ఇవ్వాలన్నారు. 9, 10 తరగతుల బాలికలకు ఉచితంగా సైకిళ్లు పంపిణీ చేయాలని కోరారు. హాస్టళ్లు, పాఠశాలల్లో అన్ని రకాల సదుపాయాలు కల్పించాలని, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయులు, వార్డెన్, వర్కర్స్ పోస్టులను భర్తీ చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, నాయకులు అభినయ్, మోహన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

కౌన్సిల్ ఆఫ్ ఆర్కిటెక్ అనుమతి ఇవ్వాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు, విద్యార్థులు

కడప సెవెన్‌రోడ్స్: వైఎస్సార్ ఫైన్ ఆర్ట్స్ అండ్ ఆర్కిటెక్చర్ యూనివర్సిటీ విద్యార్థులకు తక్షణమే కౌన్సిల్ ఆఫ్ ఆర్కిటెక్ అనుమతి ఇవ్వాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జి.వలరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట విద్యార్థులతో నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2020లో 15 స్పెషలైజ్డ్ డిపార్టుమెంట్లతో యూనివర్సిటీని ఏర్పాటు చేసిందని పేర్కొన్నారు. విశ్వవిద్యాలయ శాశ్వత భవనాల కోసం 110 ఎకరాల భూమిని, రూ. 350 కోట్లు కేటాయించిందన్నారు. కానీ, ఇప్పటికీ విశ్వవిద్యాలయం అద్దె భవనాల్లో ఉంటూ నెలకు రూ. 20 లక్షలు చెల్లిస్తున్నారని తెలిపారు. రెగ్యులర్ వీసీని, సిబ్బందిని నియమించడంలో జాప్యం చేస్తున్నారని విమర్శించారు. సీఓఏ అనుమతి లేకుండా తీసుకున్న 67 మంది విద్యార్థుల కోర్సు పూర్తి కావస్తోందని, అనుమతి లేకపోతే ఆ డిగ్రీ ఎందుకూ కొరగాదన్నారు. ఆర్ట్ అండ్ డిజైన్ నోటిఫికేషన్ విడుదల చేసినప్పటికీ 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి సీఓఏ రాలేదన్నారు. మొదటి సంవత్సరం విద్యార్థుల అడ్మిషన్లకు అనుమతి ఇస్తూ వెంటనే సెట్ నోటిఫికేషన్ ఇవ్వాలన్నారు. రెగ్యులర్ ఫ్యాకల్టీని నియమించాలని కోరారు. అనంతరం ఇన్‌ఛార్జి కలెక్టర్ అదితిసింగ్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ కార్యదర్శి తేజ, జిల్లా సహాయ కార్యదర్శి అరుణ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులకు త్వరితగతిన పరిష్కారం

– ఇన్‌ఛార్జి కలెక్టర్ అదితి సింగ్



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ అదితిసింగ్

కడప సెవెన్‌రోడ్స్ : ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చిన ఫిర్యాదులకు త్వరితగతిన పరిష్కారం చూపాలని ఇన్‌ఛార్జి కలెక్టర్ అదితిసింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సభా భవనంలో నిర్వహించిన గ్రీవెన్‌సెల్‌లో ఆమె ప్రజలనుంచి అర్జీలు స్వీకరించారు. అర్జీలలో కొన్ని వివరాలు..

– పుట్టుకతో పోలియో వల్ల వికలాంగుడినైన తాను ఎలాగో కూలీనాలీ చేసుకుంటూ కుటుంబాన్ని షించుకుంటున్నానని, తన పెద్ద కుమారుడు వేంపల్లె మహమ్మద్ హనీఫ్‌ను ఇంజినీరింగ్ చదివించేందుకు తమకు ఆర్థిక స్థోమత సరిపోవడం లేదని, పీ4 ద్వారా తమకు లబ్ధి చేకూర్చాలని మైదుకూరు మండలం శ్రీనగరానికి చెందిన వేంపల్లె గంగులు విన్నవించారు.

– ఎర్రగుంట్ల మండలం ప్రకాష్ నగర్ కు చెందిన మేరీ సుజిత తమ పిల్లలు ఆర్టిఈ ఆక్ట్ కింద ఆన్‌లైన్‌లో విజ్ఞాన్ విద్యానికేతన్ ప్రైవేట్ స్కూల్లో చదువుతున్నందువలన తల్లికి వందనం నగదు జమకాలేదని, తల్లికి వందనం పథకం మంజూరు చేయాలని కోరారు.

– ఉక్కాయిపల్లి గ్రామానికి చెందిన శమీర్ బాష తమ గ్రామంలో 29 సెంట్లు భూమి కలదని తమ భూమిని ఆనుకొని కేసీ కాలువ పోతున్నందున కేసీ కాలువ సరిహద్దులు తెలియచేయాలని విన్నవించారు.

– కడప మాసాపేట నగర్ కు చెందిన అమూజాన్ తన తల్లి 35 సంవత్సరాలు ఐసీడీఎస్ శాఖలో అంగన్వాడీ వర్కర్ గా పనిచేసి ఇటీవల మరణించిన నేపథ్యంలో తమకు ప్రభుత్వం నుంచి రావాల్సిన బెనిఫిట్స్ ఇప్పించాలని కోరారు.

– కార్యక్రమంలో డీఆర్వో విశ్వేశ్వర నాయుడు, డీఆర్‌డీఏ పీడీ రాజ్యలక్ష్మి, ఎస్డీసీ వెంకటపతి, జెడ్పీ డెప్యూటీ సీఈవో సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో మౌలిక వసతులు కల్పించాలి

కడప ఎడ్యుకేషన్/ కడప సెవెన్ రోడ్స్: కడప కొప్పర్తి వద్ద ఉన్న జగనన్న కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని ఆర్ఎంపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జల రమణయ్య డిమాండ్ చేశారు. ఈ విషయమై సోమవారం కడప కలెక్టరేట్ వద్ద కాలనీవాసులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొప్పర్తి జగనన్న కాలనీలలో మౌలిక వసతులైన వీధిలైట్లు, తాగునీరు, రోడ్లు ఏర్పాటు చేయాలని కోరారు. గత ప్రభుత్వం ఇండ్లు లేని పేదలందరికీ ఇల్లు ఇచ్చే కార్యక్రమంలో భాగంగా కడప నగరం కార్పొరేషన్ పరిధిలో కొప్పర్తి జగనన్న లేఅవుట్లో దాదాపుగా ఆరువేల ఇండ్లను ఇచ్చిందన్నారు. వాటిలో దాదాపుగా నాలుగు వేల ఇండ్లు పూర్తి అయ్యాయన్నారు. అప్పో సప్పో చేసుకొని ప్రైవేటు వ్యక్తుల వద్ద వడ్డీలకు డబ్బులు తెచ్చుకుని ఇల్లు పూర్తి చేసుకున్నా వాటిల్లో ఉండడానికి మౌలిక వసతులు లేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. తాగునీరు తెచ్చుకోవాలంటే ఐదారు కిలోమీటర్లు పోయి తెచ్చుకోవాల్సిన పరిస్థితి వచ్చిందని వారు వాపోయారు. అక్కడ బోర్లు ఉన్నా విద్యుత్ కనెక్షన్లు, పైప్ లైన్‌లను తొలగించి ఎక్కడ పడితే అక్కడ పడవేశారన్నారు. వీధి లైట్లు ఉన్నా అవి నిరుపయోగంగా ఉన్నాయన్నారు. వాటికి కనెక్షన్లను తొలగించారని వారు వాపోయారు. రాత్రి అయితే అరణ్యంలో ఉన్నట్లు ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి జగనన్న కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంపీఐ జిల్లా కార్యదర్శి కొడవటికంటి నాగరాజు, జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి భాస్కర్, కడప నగర నాయకులు శ్రీనివాసులు, రమేష్, సుబ్బరాయుడు , మల్లారెడ్డి, రవి, లక్ష్మిదేవి, నాగ మునెమ్మ, రమాదేవి, కాలనీవాసులు పాల్గొన్నారు.



కాలనీ వాసులతో కలిసి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆర్ఎంపీఐ నాయకులు

కళాశాలల అభివృద్ధికి కృషి చేయాలి



ఆర్ఐవోగా బాధ్యతలు చేపట్టిన వెంకటేశ్వర్లును సన్మానిస్తున్న ప్రభుత్వ బాలుర కళాశాల ప్రిన్సిపాల్



బదిలీపై వెళ్లిన ఆర్ఐవో వెంకటసుబ్బయ్యను సన్మానిస్తున్న అధ్యాపకులు

కడప ఎడ్యుకేషన్: ఇంటర్ ఆర్ఐవోగా జిల్లాలో ఇంటర్ విద్యతోపాటు కళాశాలల అభివృద్ధికి కృషి చేయాలని ఆర్ఐవో బాధ్యతలు చేపట్టిన వెంకటేశ్వర్లును ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జ్ఞానేశ్వరితోపాటు అధ్యాపకులు కోరారు. ఇంటర్ ఆర్ఐవోగా బాధ్యతలు చేపట్టిన వేంకటేశ్వర్లును వారు సోమవారం ఘనంగా సన్మానించారు.

ఆర్ఐవోగా వెంకటసుబ్బయ్య సేవలు మరువలేనివి...

జిల్లాలో ఇంటర్ ఆర్ఐవోగా పనిచేసిన వెంకటసుబ్బయ్య సేవలు మరువలేనివని వారు అన్నారు. ఆయన పనిచేసినంత కాలం ఎలాంటి ఆరోపణలకు తావులేకుండా పనిచేశారన్నారు. ఆయన సేవలను కొనియాడుతూ ఆయనను ఘనంగా సన్మానించారు.

ఈ కార్యక్రమంలో సీనియర్ అధ్యాపకులు హబీబుల్లా, సుధాకర్‌రెడ్డి, శ్రీరాములరెడ్డి, చంద్రమౌళి, రామసుబ్బయ్య, సుధాకర్, రాజులతోపాటు ఎన్ఎస్ఎస్ అధికారి చెప్పలి రాజారావు పాల్గొన్నారు.

ఈ పంట నమోదు తప్పనిసరి

కమలాపురం: కమలాపురం వ్యవసాయ డివిజన్ పరిధిలో ఈ పంట నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని ఏడీఏ నరసింహారెడ్డి అన్నారు. మండలంలో జరుగుతున్న ఖరీఫ్-2025 ఈ-పంట నమోదును సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ జాబితాలో పేర్లు లేని రైతులు ఈ నెల 23వ తేదీలోపు గ్రీవెన్స్ నమోదు చేసుకోవాలని సూచించారు. ఆర్ఎస్‌కే సిబ్బందిని కలిసి ఈ-పంట నమోదు చేసుకోవాలని, అప్పుడే ప్రభుత్వ పథకాలు అందుతాయని తెలిపారు. అన్నదాత సుఖీభవ జాబితాలో పేర్లు లేని రైతులు ఈ నెల 23వ తేదీలోపు గ్రీవెన్స్ నమోదు చేసుకోవాలన్నారు. ఖరీఫ్ సీజన్‌లో సాగుచేసే మినుము, ఉల్లి పంటలకు ఈ నెల 30వ తేదీలోపు ప్రీమియం చెల్లించాలన్నారు. వరికి మాత్రం ఆగస్టు 13వతేదీ వరకు గడువు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ సరస్వతి, ఏఈఓలు, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

న్యాయ విజ్ఞాన సదస్సు

కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ సూచనల మేరకు కడప రిమ్స్ ఆవరణలోని జిల్లా బాల భవిత కేంద్రంలో సోమవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులు మాట్లాడుతూ పిల్లలకు పుట్టుకతో వచ్చే ఎదుగుదల లోపాలకు సంబంధించి జిల్లా బాల భవిత కేంద్రంలో ఉన్న చికిత్స సెంటర్లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇందుకోసం జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఇంటింటి ప్రచారాన్ని నిర్వహిస్తోందన్నారు. అలాగే ఎదుగుల లోపాలు గల పిల్లల పట్ల తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలని, ప్రస్తుత సమాజంలో ప్రత్యేక పిల్లలు కూడా ఉన్నత స్థానాలను అధిరోహిస్తున్నారన్న విషయాన్ని గుర్తించాలన్నారు. అనంతరం పలు చట్టాల పట్ల అవగాహన కల్పించారు. అలాగే జాతీయ మానసిక ఆరోగ్య విధానం 2014, లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100, చైల్డ్ లైన్ హెల్ప్‌లైన్ నెంబర్ 1098, దివ్యాంగజన్ హెల్ప్ లైన్ నెంబర్ 14456, ఉచిత న్యాయ సహాయం తదితర అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్స్ ప్రవీణ్ కుమార్ , రవితేజ, వైద్యాధికారి డాక్టర్ గీత, ఆప్టోమెట్రీ కిరణ్, పారా లీగల్ వాలంటరీ దశరథరామిరెడ్డి, జిల్లా బాల భవిత కేంద్రం ప్రతినిధులు, చిన్నారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సీపీఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న సీపీఐ నగర కార్యదర్శి వెంకట శివ

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : పాలక ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై సమరశీల పోరాటాలే లక్ష్యంగా జూలై 22 నుండి 24 వరకు బద్వేల్‌లో జరుగుతున్న జిల్లా 25 వ మహాసభలను విజయవంతం చేయాలని సీపీఐ నగర కార్యదర్శి ఎస్.వెంకట శివ పేర్కొన్నారు. బద్వేల్‌లో 22వ తేదీ మంగళవారం జరుగుతున్న సీపీఐ జిల్లా మహాసభల ర్యాలీ బహిరంగ సభను జయప్రదం చేయాలని నగరంలోని వివిధ ప్రాంతాల్లో పార్టీ నాయకులు ప్రచారం నిర్వహించారు. 48వ డివిజన్ అల్లూరీ సీతారామరాజు నగర్, చెంచు కాలనీలో జరిగిన సీపీఐ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంగళవారం సాయంత్రం కడప రోడ్డులోని బద్వేలు మార్కెట్ యార్డ్ నుండి నాలుగు రోడ్ల వరకు ప్రజా ప్రదర్శన అనంతరం బహిరంగ సభ ఉందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకష్ణ, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి. ఈశ్వరయ్య, శివారెడ్డి తదితరులు ముఖ్య అతిథులుగా విచ్చేస్తున్నారన్నారు. 23, 24 తేదీల్లో ప్రతినిధుల మహాసభ జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో సీపీఐ నగర కార్యవర్గ సభ్యులు కె.మునయ్య, ఆర్.బాబు, శాఖ కార్యదర్శి సత్తార్, సహాయ కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యావలంటీర్ల నియామకాలను ఆలస్యం చేయవద్దు



కమిషనర్ మనోజ్‌రెడ్డికి వినతి పత్రం సమర్పిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

కడప కార్పొరేషన్: కడప నగరపాలక సంస్థ పరిధిలోని పాఠశాలల్లో గత కొన్ని సంవత్సరాలుగా కొనసాగుతున్న విద్యా వలంటీర్ల రెన్యువల్ ప్రక్రియను ఆలస్యం చేయవద్దని ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ కేసీ బాదుల్లా, జిల్లా కార్యదర్శి కె. లింగన్న, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి కె. మునెయ్య కోరారు. సోమవారం కమిషనర్ మనోజ్‌రెడ్డికి వారు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులు లేక సరైన బోధన జరగడం లేదని, చదువులలో విద్యార్థులు వెనుకబడిపోకుండా గత కొన్ని సంవత్సరాలుగా విద్యా వాలంటీర్లతోనే బోధకుల కొరతను అధిగమిస్తూ వస్తున్నారని గుర్తు చేశారు. నగర పాలక సంస్థ పరిధిలో అప్ గ్రేడ్ అయిన పాఠశాలలు ఇతర పాఠశాలలో ప్రధాన సబ్జెక్టులకు అలాగే ఉర్దూ మీడియం సంబంధించిన ఉపాధ్యాయులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారని, ఆలస్యం చేయకుండా విద్యా వాలంటీర్ల నియామకాలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

సన్మానం



ఉపాధ్యాయుడు పవన్ కల్యాణ్‌ను సన్మానిస్తున్న కృష్ణకిశోర్ తదితరులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : బీరం శ్రీధర్ ఇంటర్నేషనల్ స్కూలులో ఆర్ట్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ జాతీయ స్థాయిలో ఆన్‌లైన్ పెయింటింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన బండి పవన్ కల్యాణ్‌ను ఘనంగా సత్కరించారు. మే 7 న మన దేశం నిర్వహించిన ఆపరేషన్ సింధూర్ గెలుపుని పురస్కరించుకొని క్రియేటివ్ హార్ట్స్ అకాడమీ వారు నిర్వహించిన పెయింటింగ్ పోటీల్లో పవన్ కల్యాణ్ నేషనల్ గోల్డ్ మెడల్, గోల్డెన్ బ్రష్ ఆర్టిస్ట్ టైటిల్ గెలుపొందారు. ఈ సందర్భంగా వికలాంగుల సంక్షేమశాఖ ఏడీ కృష్ణకిశోర్, మై భారత్ (నెహ్రూ కేంద్రం) సిబ్బంది, మదర్ థెరిసా సేవా సమితి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ విజయ్ కుమార్ ఆయనను సన్మానించారు.